ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం, 11 ఆగస్టు 2024
5





నేడు ముగ్గురు మంత్రుల రాక

- పూసుగూడెం, కమలాపురంలో 'సీతారామ' ట్రయల్‌రన్ పరిశీలన
- ఏన్కూరు లింక్ కెనాల్‌పై ఏరియల్ సర్వే
- వైరాలో సీఎం బహిరంగసభ ఏర్పాట్లపై సమీక్ష

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ కొత్తగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 15న జిల్లాకు రానున్న నేపథ్యంలో వీరి రాక ప్రాధాన్యత సంతరించుకొంది. ఉదయం హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టర్‌లో 9.30 గంటలకు బయలుదేరి 10.30 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములకలపల్లి మండలంలోని పూసుగూడెం గ్రామానికి చేరుకుంటారు. పూసుగూడెం 2వ పంపుహౌస్ సీతారామ ప్రాజెక్టుకు చెందిన ట్రయల్‌రన్‌ను 11.30 గంటలకు పరిశీలిస్తారు. అక్కడి నుంచి ఆ మండలంలో ఉన్న కమలాపురంలోని సీతారామ ప్రాజెక్టు 3వ పంపుహౌస్ ట్రయల్‌రన్‌ను మధ్యాహ్నం 12.30 గంటలకు పరిశీలిస్తారు.

అనంతరం ఏన్కూరు లింక్‌కెనాల్ పనులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలిస్తారు. అనంతరం 1.30 గంటలకు ఖమ్మం జిల్లాలోని వైరా చేరుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 15వ తేదీన హాజరుకానున్న బహిరంగసభ స్థలాన్ని మంత్రులు పరిశీలించనున్నారు. అక్కడి నుంచి పాలేరు నియోజకవర్గానికి వెళ్లి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. ముగ్గురు మంత్రుల పర్యటన నేపథ్యంలో రెండు జిల్లాల అధికారయంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

డార్క్‌వెబ్‌లో డ్రగ్స్ కొనుగోలు

- పోస్టల్ స్పీడ్‌పోస్ట్‌లో సరఫరా
- క్రాక్ చేసి, ట్రాక్ చేసిన టీజీఏఎన్‌బీ



నార్కొటిక్ బ్యూరో స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ ప్యాకెట్

ఖమ్మం, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మత్తుకు అలవాటుపడిన సాఫ్ట్‌వేర్ యువకుడు డార్క్‌వెబ్ ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేశాడు. కొనుగోలుకు అవసరమైన నగదును క్రిప్టోకరెన్సీ ద్వారా చెల్లించాడు. సరఫరాదారుడు డ్రగ్స్ సరఫరా చేసేందుకు పోస్టల్ శాఖను వాడుకున్నాడు. ఆ డ్రగ్ సదరు యువకుడికి చేరేలోపులోనే తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో పసిగట్టి పట్టుకుంది. ఖమ్మం నగరానికి చెందిన యువకుడు మత్తు కోసం వినియోగించే డ్రగ్స్‌పై నిఘా ఉండటంతో తనకు కావాల్సిన డ్రగ్‌ను డార్క్‌వెబ్ ద్వారా క్రిప్టో కరెన్సీ రూపంలో చెల్లించి కొనుగోలు చేశాడు. అనంతరం అతనికి డార్క్‌వెబ్ విక్రేత పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లోని స్పీడ్‌పోస్టు ద్వారా అస్సాం రాష్ట్రంలోని సిల్చుఖురి నుంచి పంపించాడు.

అయితే అప్పటికే తెలంగాణ యాంటీ నార్కోటింగ్ బ్యూరో టెక్నికల్ వింగ్ ఆన్‌లైన్‌లో డ్రగ్ వినియోగంపై నిఘాను పెంచి, డార్క్‌వెబ్‌లోని యాక్టివ్‌గా ఉన్న నెట్‌వర్క్‌ను క్రాక్ చేసింది. అందులో డ్రగ్ కొనుగోలు చేసిన విషయాన్ని ధృవీకరించుకుని ఆ డ్రగ్ ఎక్కడకు వెళ్తుందనే విషయాన్ని ట్రాక్ చేసింది. అది ఖమ్మం చేరుకునే సమయానికి టూటౌన్ పోలీసుల సహాయంతో సదరు యువకుడి ఇంటికి చేరుకుని అతని నివాసంలో సదరు పోస్టును అందుకునే సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

దాన్ని తెరచి చూడగా ఓ వార్తపత్రికపై బ్రౌన్ టేప్ వేసి దానికింద డ్రగ్‌ను దాచి పోస్టుద్వారా పంపినట్టుగా గుర్తించారు. కాగా డ్రగ్స్‌కు బానిసైన యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాగా దానికి సంబంధించిన చైన్‌లింకుపై దర్యాప్తు చేయనున్నట్టు, డ్రగ్స్ నియంత్రించేందుకు నిరంతరం నిఘా కొనసాగుతోందని టీజీఏఎన్‌బీ అధికారులు తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగ, విక్రయాల వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 871267111, 1908 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల అరెస్ట్

- 4 ఫోన్లు, కారు, రూ.30వేల నగదు స్వాధీనం

ఖమ్మం క్రైం, ఆగస్టు 10: 'ఫుడ్ ఇన్‌స్పెక్టర్లం...' అంటూ హోటల్ యజమానిని డబ్బుల కోసం బెదిరించిన కేసులో నలుగురిని ఖమ్మం ఖనాపురం హవేలి పోలీసులు శనివారం సాయంత్రం అరెస్ట్ చేశారు. నగరంలోని మమతా రోడ్డులోని కింగ్ దర్బార్ హోటల్‌లో శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గుగులోత్ మోహన్‌రావు, బానోతు రామస్వామి, సపావత్ యువరాజ్, జయశంకర్ భూపాలపల్లి కి చెందిన అజ్మీరా యువరాజ్‌సింగ్‌లు తాము ఫుడ్ ఇన్‌స్పెక్టర్లమని చెప్పుకొని తనిఖీలు చేశారు. అనంతరం ఆహారపదార్థాలు బాగాలేవని, కేసులు పెడతామని బెదిరింపులకు దిగారు. రూ. 2 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించారు. ఇందులో ఇతర అధికారులకు కూడా ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. అయితే హోటల్ నిర్వాహకులు వారి తీరును గమనించి గదిలో నిర్బంధించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు అదుపులోకి తీసుకొని విచారణ జరిపి కేసు నమోదు చేశారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. అదేవిధంగా వారి వద్ద నుండి నాలుగు ఫోన్లు, ఒక కారు, రూ.30వేల నగదు స్వాదీనం చేసుకున్నట్టు తెలిపారు.

జల నిధి



పాలేరు జలాశయం

సాగర్ ఎడమకాల్వ

సండే స్పెషల్ SUNDAY SPECIAL

- లక్షలాది ఎకరాలకు సాగునీరు.. కోట్లాది ప్రజలకు తాగునీరు
- జలవిద్యుత్ కేంద్రం ద్వారా తక్కువ ఖర్చుతో విద్యుదుత్పత్తి
- మత్స్యకారులకు వరం... పర్యాటకులకు విహారకేంద్రం
- మత్స్య సొసైటీ ఆధ్వర్యంలో దేశ విదేశాలకు చేపల ఎగుమతి
- 2000 కుటుంబాలకు జీవనోపాధి

సిరుల తల్లి.. కల్పవల్లి..

రైతుల వర ప్రదాయిని.. పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

కూసుమంచి, ఆగస్టు 10: జిల్లా రైతులకు సాగునీటి కోసం నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు సాగునీరందించేందుకు నిర్మించిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఐదు దశాబ్దాలుగా అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి, జీవనోపాధి, చేపపిల్లల ఉత్పత్తి, విద్యుతుత్పత్తి, తాగునీరు, విహార కేంద్రంగా ఉపయోగపడుతోంది. ఖమ్మం-హైదరాబాద్ రాష్ట్ర రహదారిపై ఖమ్మంనుంచి 25 కి.మీ. దూరంలో కూసుమంచి మండల పరిధిలో ఖమ్మం, నల్గొండ జిల్లాలకు తలమానికంగా ఉంది. 1929 ప్రాంతంలో నిజాం కాలంలో నిర్మించిన పాలేరు చెరువును నాగార్జున సాగర్ ఎడమకాలువను అనుసంధానం చేసి సాగర్ జలాలకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చారు. 1975లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కృషితో 1800 ఎకరాల విస్తీర్ణంలో రిజర్వాయర్‌గా నిర్మించారు. దానిద్వారా జిల్లాలోని 2.8 లక్షల ఎకరాల్లో వరి, 3లక్షల ఎకరాల ఆరుతడి పంటలు పండేవిధంగా రూపకల్పన చేశారు. పాలేరు నుంచి 80 కి.మీ. ఖమ్మం జిల్లాలోనూ, 100 కి.మీ. కృష్ణా జిల్లాలో కాలువను తవ్వించటంతో రైతుల పాలిట కల్పతరువుగా మారింది. ఖమ్మం జిల్లాలో 119 మేజర్లు, 3090 మైనర్లు, సబ్‌మైనర్లు, 223 బ్రాంచ్ కెనాల్స్ ఉన్నాయి. సాగర్ ప్రధాన కాలువ ఖమ్మంజిల్లాలో పాలేరు జలాశయం నుంచి ప్రారంభమై కృష్ణా జిల్లా తిరువూరు వద్ద ముగుస్తుంది. గత మూడు దశాబ్దాలుగా జిల్లాలో కృష్ణమ్మ పరుగులు పెడుతుండటంతో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారు. అప్పుడప్పుడు వర్షాభావ పరిస్థితులలో మినహా పాలేరు రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగుల నీటితో నిత్యం కళకళలాడుతోంది.

మత్స్య పరిశోధనాస్థానం

ప్రభుత్వం మత్స్యకారులను దృష్టిలో ఉంచుకొని మత్స్య పరిశోధనా స్థానాన్ని ఏర్పాటు చేయడం వారికి వరంగా మారింది. జిల్లా నుంచే కాకుండా తెలంగాణ ప్రాంతంలోని ఔత్సాహిక రైతులకు చేపల పెంపకంపై గత దశాబ్దకాలంగా శిక్షణ ఇస్తున్నారు. చేపల పెంపకం, వాటికి ఆశించే వ్యాధులపై ఈపరిశోధనాకేంద్రంలో పరిశోధనలు జరుగుతున్నాయి. రిజర్వాయర్‌లో మత్స్యసొసైటీ ఆధ్వర్యంలో రొయ్యలను సాగుచేస్తూ దేశవిదేశాకు ఎగుమతి చేస్తున్నారు. సుమారు 2000 మంది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తుంది.

మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో ఇక్కడి విద్యార్థుల అవసరార్థం తెలంగాణ ప్రభుత్వం మత్స్య పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేసింది. ఇప్పటి వరకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న కళాశాల ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. దీంతో తెలంగాణకు 2022లో కళాశాల మంజూరుచేస్తూ ఉత్తర్వ్యులు జారీ చేసినప్పటికీ తాత్సారం జరిగింది. 10 ఎకరాల స్థలం కేటాయించారు. భవనాల నిర్మాణం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు.

జలవిద్యుత్‌కేంద్రం

రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఎడమకాల్వపై మినీహైడల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేశారు. రెండు జనరేటర్ల ద్వారా ప్రతిగంటకు రెండు మెగావాట్ల విద్యుతుత్పత్తి జరుగుతోంది. అతి తక్కువ ఖర్చుతో ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ఈఉత్పాదన ప్రక్రియలో వృథా అయ్యే సాగర్‌జలాలు సైతం ఎడమకాలువలోకి మళ్లించటంతో తిరిగి ఆనీరు సాగుకు ఉపయోగపడుతున్నాయి.

పర్యాటక ప్రాంతం

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పాలేరు జలాశయం పర్యాటకులకు సోయగాలు అందిస్తోంది. ట్యాంకుబండ్‌పై పెద్దల పార్కుతో పాటు చిన్న పిల్లల పార్కు అన్నిరకాల ఆటవస్తువులను ఏర్పాటుచేశారు.



పాలేరు మత్స్యపరిశోధనా స్థానం

రిజర్వాయర్‌లో బోటింగ్‌ఏర్పాటు చేయటంతో సెలవుదినాల్లో ఈప్రాంతం విడిదిగా మారింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పర్యాటక రంగంపై శీతకన్ను వేయడంతో గత కొంతకాలంగా పార్క్ శిథిలావస్థకు చేరింది.

2,439 ఆవాస ప్రాంతాలకు తాగునీరు

రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాతో పాటు సరిహద్దులోని సూర్యాపేట, మహబూబాబాద్, జిల్లాల్లోని 2,439 ఆవాస ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందిస్తుంది. మహబూబాబాద్ జిల్లాలో 16 మండలాల్లో 1769 ఆవాసప్రాంతాలు, ఖమ్మంజిల్లాలో ఖమ్మం నగరంతో పాటు, 6మండలాల్లో 276 ఆవాసప్రాంతాలకు, సూర్యాపేట జిల్లాలో 12 మండలాల్లో 253 ఆవాసప్రాంతాలకు శుద్ధిచేసిన తాగునీటిని అందిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ పాలేరు జలాశయం ద్వారా ఈయేడాది తాగునీరు అందించడం విశేషం. పాలేరు నియోజకవర్గంలోని 80 గ్రామాల ప్రజలకు ఫ్లోరైడ్ రహిత నీటిని అందిస్తున్నారు. కూసుమంచి, తిర్మలాయపాలెం మండలాల్లోని సుమారు 70 గ్రామాల ప్రజలకు త్రాగునీరందుతుండటంతో దాహార్తి తీరినట్లయింది.



వివరాలు : 6లో

- ఖమ్మం వైఎస్ఆర్ నగర్‌లో మంత్రి తుమ్మల పర్యటన
- గుట్టలపైకి ఎక్కి ప్రజలతో మాటామంతీ
- గ్రామసభలో రూ.4 కోట్ల నిధుల మంజూరు
- హర్షం వ్యక్తం చేసిన 8వ డివిజన్ ప్రజలు

జనం చెంతకు వెళ్లి.. సమస్యలు తెలుసుకొని...



'సీతారామ' ప్రాజెక్టు ఘనత మాదే...

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 90శాతం పనుల పూర్తి
- కేవలం లింక్ కెనాల్ తవ్వించి గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

వివరాలు : 6లో



- నగరంలో ఒక్కో వైకుంఠదామంలో ఒక్కో ధర
- కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ వైకుంఠదామాలకు పొంచి ఉన్న ముంపుభయం

7

కాటికాడ కాసుల పంచాయితీ



- నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీల వైద్యం
- వ్యాధి ఒకటి అయితే వైద్యం మరొకటి
- ల్యాబ్‌లలో మాయాజాలం

6

ప్రజల ప్రాణాలతో చెలగాటం



- చెస్‌లో పాల్వంచ విద్యార్థికి 1503 'మైలురాయి'
- చదరంగంలో అంతర్జాతీయ స్థాయి రాపిడ్ టోర్నమెంట్‌లో విశేష ప్రతిభ

6

రామ్ నచ్చికేత్‌కు ఫిడే రేటింగ్


వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలి

- ఖమ్మం డీఈ నంబూరి రామారావు

రఘునాథపాలెం, ఆగస్టు10: వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని ఖమ్మం విద్యుత్ డివిజన్ డీఈ నంబూరి రామారావు సూచించారు. శనివారం మంచుకొండ విద్యుత్ ఉపకేంద్రం పరిదిలోని దొనబండ, ఈర్లపూడి గ్రామాల్లో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ మోటర్లు వినియోగంపై అవగాహన కల్పించారు. ఏడీఈ సంజీవ కుమార్, ఏఈఈ సతీష్, రైతులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి:రైతులు వ్యవసాయ మోటార్ల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని కూసుమంచి విద్యుత్ ఏడీఈ కోక్యానాయక్ కోరారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా శనివారం మంద్రాజుపల్లి, మంద్రాజుపల్లి కొత్తూరు గ్రామాల్లో రైతుతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో రాజేశ్వరపురం ఏఈ నారాయణరావు, రైతులు వజ్జా శ్రీనివాసరావు, వజ్జా రామారావు, దండా నర్సింహారావు, పిన్నెబోయిన వెంకటి, వజ్జా శ్రీను, వజ్జా బుచ్చయ్య పాల్గొన్నారు.

భద్రాద్రికి రైలు యోగం



భద్రాచలం/ పాల్వంచ రూరల్, ఆగస్టు 10: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలానికి రైల్వే లైన్ కోసం దశబ్దాల కాలంగా ఎదురు చూస్తున్న రామభక్తుల కల ఎట్టకేలకు నెరవేరేందుకు మార్గం సుగమమైంది. భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి రామభక్తులు తరలివస్తుంటారు. అయితే రైలు మార్గం లేకపోవడంతో ఇంత కాలం వారు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రధానమంత్రి గతిశక్తి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం పాండురంగాపురం నుంచి ఒడిసా రాష్ట్రంలోని మల్కన్‌గిరి(జునాఘర్)కు రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో 173.61 కిలోమీటర్ల దూరానికి రూ.3,592 కోట్లతో పనులు చేపట్టనున్నారు. తెలంగాణ, ఆంధ్ర, ఒడిసా రాష్ట్రాల మీదుగా సాగనున్న ఈ రైల్వేలైన్ పనులతో భద్రాద్రికి వచ్చే రామభక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. పాండురంగాపురం నుంచి మొదలయ్యే ఈ రైల్వేలైన్ కూనవరం, ఎటపాక మండలాల మీదుగా భద్రాచలం చేరుకుంటుంది.

ఎఫ్ఎల్ఎస్ మంజూరు

పాండురంగాపురం-మల్కన్‌గిరి కొత్త రైల్వేలైన్‌కు కోసం ఫైనల్ లోకేషన్ సర్వే(ఎఫ్ఎల్ఎస్) 2023 సెప్టెంబరులో మంజూరై పూర్తయింది. ఇక నిర్మాణ పనులకు సంబంధించిన ప్రకటన ఈ ఏడాది బడ్జెట్‌లో ఉంటుందని ఆశ పడ్డారు. అయితే ప్రభుత్వం బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ క్రమంలో కేబినెట్ కమిటీ రైల్వేలైన్‌కు ఆమోదం తెలుపుతూ నిధులు కేటాయించడంతో హర్షం వ్యక్తమవుతోంది. ఈ రైల్వేలైన్ ద్వారా వ్యవసాయం, వ్యాపారం, విద్యా, పర్యాటక, ఆరోగ్య సంరక్షణలతో పాటు బహుళ వ్యాపార రంగాలకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చినట్లు అవుతుంది. అంతే కాదు ఒడిసా, తెలంగాణలోని పరిశ్రమలకు ఓడరేవుల (కాకినాడ) దూరాన్ని తగ్గించడానికి ఎంతోగానో ఉపయోగపడనుంది. అలాగే ప్రయాణికుల, సరకు రవాణా పెంచడంలో ఎంతో కీలకం కానుంది.

- పాండురంగాపురం నుంచి మల్కన్‌గిరికి కొత్త రైల్వేలైన్ మంజూరు
- ఇతర రాష్ట్రాల రామభక్తులకు అందుబాటులోకి రానున్న రైలు ప్రయాణం
- దక్షిణ అయోధ్యకు పెరగనున్న భక్తుల సంఖ్య

రామభక్తులకు ఉపయోగకరం

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలానికి రైలు సౌకర్యం కావాలని ఈ ప్రాంత వాసులు మూడున్నర దశబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. ఎంపీ ఎన్నికలు వచ్చాయంటే పాండురంగాపురం-సారపాక రైల్వేలైను పొడిగింపు అంశం ప్రచార అంశంగా ఉండేది. గతంలో 14 కిలోమీటర్ల రైల్వే లైన్ కోసం అప్పటి ఎంపీలు కృషి చేసినా ఆ ప్రతిపాదన ఆచరణకు నోచుకోలేదు. ఈ క్రమంలో కేంద్రం తాజాగా పాండురంగాపురం-మల్కన్‌గిరి రైల్వేలైన్ మంజూరు చేయటంతో దక్షిణ అయోధ్యకు మహర్దశ పట్టే అవకాశం ఉందని ఈ ప్రాంత వాసులు విశ్వసిస్తున్నారు. ఒడిసా, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన రామభక్తులు సులభంగా రైల్వే మార్గం

(మిగతా 6వ పేజీలో)

దురుదపాడు పాఠశాలకు బల్లల వితరణ

● మంత్రి తుమ్మల మనుమడు హితేష్‌ను అభినందించిన గ్రామస్థులు



దురదపాడు పాఠశాలకు బల్లలను అందజేస్తున్న హితేష్


దమ్మపేట, ఆగస్టు 10: దురుదపాడు ప్రాథమిక పాఠశాలకు రూ.లక్ష విలువచేసే బల్లలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మనవడు చేతన స్వచ్ఛందసంస్థ ఫౌండర్ వల్లభనేని హితేష్ తండ్రి విజయ్, పెదనాన్న శేఖర్‌తో కలిసితో పాఠశాలకు శనివారం బల్లలను వితరణగా అందజేశారు. కాసాని నాగప్రసాదు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతు స్వచ్ఛందసంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టటం పట్ల హితేష్‌ను అభినందించారు. హితేష్ మాట్లాడుతు ప్రతి ఒక్కరు చదువు కోవాలని చదువుతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. తాను గతంలో ఈపాఠశాలను సందర్శించగా విద్యార్థులు కింద కూర్చుని చదువు కోవటం చూసానన్నారు. దీంతో పాఠశాలకు బల్లలు అందజేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చానని మాట ప్రకారం బల్లలు అందజేస్తున్నట్లు తెలిపారన్నారు. తన కార్యక్రమాలకు తాత తుమ్మల నాగేశ్వరరావు, తండ్రి విజయ్, పెదనాన్న శేఖర్ తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సోయం ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, కేవి సత్యనారాయణ, కాసాని మంగేశ్వరరావు ఎర్రా వసంతరావు, మెచ్చు వెంకటేశ్వర్లు, సుశీల రాజేష్, ఎంఈవో లక్ష్మి గండుగులపల్లి హెచ్ ఎం మస్తాన్ వలీ, ఉపాధ్యాయుడు రమేష్ ఘంటా వెంకటేశ్వరరావు, అంగన్‌వాడి సూపర్ వైజర్ సాలమ్మ గ్రామస్థులు పాల్గొన్నారు.

పాల్వంచ విద్యార్థికి అంతర్జాతీయ చెస్ రేటింగ్

పాల్వంచ, అగస్టు 10: పాల్వంచ విద్యార్థి అంతర్జాతీయ చెస్ ఫిడే రేటింగ్ సాధించాడు. ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్వంచకు చెందిన విద్యార్థి చిలకబత్తిని రామ్ నచ్చికేత్ ప్రతిభను కనబరిచి అంతర్జాతీయ రేటింగ్ సాధించాడు. జూలై 12, 13, 14 తేదీల్లో విజయవాడలో జరిగిన అంతర్జాతీయ చెస్ రేటింగ్ టోర్నమెంట్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరచడంతో ఆగస్టులో ప్రకటించిన ఫిడే చెస్ రేటింగ్స్‌లో 1503 రేటింగ్ సాధించడం విశేషం. చెస్ నేర్చుకున్న రెండు సంవత్సరాలకే అంతర్జాతీయ చెస్ రేటింగ్ సాధించిన రామ్ నచ్చికేత్‌ను శనివారం నవభారత్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీ రెడ్డి, పాఠశాల పీఈటీ, ఉపాధ్యాయులు, స్వేరో చైర్మన్ దుర్గయ్య అభినందించారు. అంతర్జాతీయ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లోనూ పాల్గొన్నాడు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంపీల వైద్యం
- వ్యాధి ఒకటి అయితే వైద్యం మరొకటి
- ల్యాబ్‌లలో కూడా మాయాజాలం
- ప్రైవేటు ఆస్పత్రులకు ఏజెంట్లుగా పాత్ర
- సామాన్యులను నిలువుదోపిడీ చేస్తున్న వైనం



సత్తుపల్లి, ఆగస్టు 10: పాలకులు, అధికారులు పట్టించుకోకపోవటంతో ప్రైవేటు వైద్యం దారుణంగా తయారైంది. గ్రామాల్లో కొందరు ఆర్‌ఎంపీ(రూరల్ మెడికల్ ప్రాక్టీస్)లు అనుమతులు లేకుండా చేస్తున్న వైద్యం కారణంగా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం లేదు. సత్తుపల్లి డివిజన్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం తీరు దయనీయంగా మారింది. ల్యాబ్‌ల పరిస్థితి దారుణంగా ఉంది. ఫిర్యాదులు అందలేదని ఒకపక్క అధికారులు తమ బాధ్యతల నుంచి తప్పించుకుంటుండగా, ప్రాణాలు పోతే సెటిల్‌మెంట్లు చేస్తూ తమ వైద్య వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగించటం వెనుక ఎవరున్నారనే విషయం చర్చనీయాంశంగా మారింది.

నిబంధనలకు విరుద్ధంగా..

సత్తుపల్లి డివిజన్లో ప్రతి గ్రామంలో ఆర్‌ఎంపీలు ఇష్టారాజ్యంగా రోగులకు వైద్యం చేస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్య సహాయం (ఫస్ట్ ఎయిడ్) మాత్రమే చేయాలి. కనీసం ఇంజక్షన్ కూడా చేసే అవకాశం లేదు. కాని కొందరు ఆర్‌ఎంపీలు ఏకంగా ఆసుపత్రులను అందులో బెడ్స్ ఏర్పాటు చేసుకొని వైద్యం చేస్తున్నారు. ఇటీవల మర్లపాడులో ఒక మెడికల్ షాపు యజమాని భారీ స్థాయిలో ఆసుపత్రిని సొంతంగా నిర్వహిస్తుండగా స్థానికులు ఫిర్యాదు చేయటంతో సదరు వ్యక్తికి నోటీసు జారీ చేశారు.

ఆర్‌ఎంపీలకు హోల్‌సేల్‌గా మందులు విక్రయించవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేసినా కొందరు ఆర్‌ఎంపీలు భారీ స్థాయిలో అన్ని రకాల మందులు, సెలైన్ సీసాలు ఇళ్లలో స్టాకు పెట్టుకొని మరీ వైద్యం చేస్తున్నారు. యాంటీ బయాటిక్ మందులు కూడా ఇష్టారాజ్యంగా ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జనరిక్ మందులను తక్కువ ధరకు కొనుగోలు చేసి గ్రామాల్లో రోగులకు ఇస్తూ పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీరికి మందులు ఎక్కడ నుంచి వస్తున్నాయనే విషయంపై అధికారులు ఇంత వరకూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆర్‌ఎంపీల వ్యవస్థ గ్రామాల్లో వేళ్లూనుకోవటంతో పాటు వారికి రాజకీయ అండదండలు కూడా ఉండటంతో గ్రామాల్లో వైద్యం వ్యాపారం మరింత విస్తరిస్తోంది. కొందరు ఆర్‌ఎంపీలు ప్రైవేటు ఆస్పత్రులకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. రోగులను పంపిస్తూ కమీషన్లు దండుకుంటున్నారు.

వ్యాధి ఒకటి.. వైద్యం మరొకటి..

వ్యాధి ఒకటి అయితే వైద్యం మరొకటి అన్నట్లుగా ఆర్‌ఎంపీల వైద్యం ఉంది. సత్తుపల్లి మండలం రేగళ్లపాడు గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక విరేచనాలతో బాధపడుతూండగా రెండు రోజుల పాటు ఆర్‌ఎంపీ ఒకరు వైద్యం చేశారు. పరిస్థితి విషమించటంతో సత్తుపల్లిలో బాలాజీ థియేటర్ సమీపంలోని ఆసుపత్రికి తీసికెళ్లాలని సూచించటంతో అక్కడికి తీసికెళ్లి చేర్పించగా అక్కడి వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించాలని అంబులెన్స్‌లో ఎక్కించారు. కాని అప్పటికే బాలిక మృతి చెందిందని కుటుంబ సభ్యులు గుర్తించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అక్కడి వైద్యుడు విలేకర్లకు చెప్పిన విషయం ఏమిటంటే విరేచనాలు, వాంతులు, ప్లేట్‌లెట్స్ పడిపోవటంతో పాటు బీపీ పడిపోయిందని, దీనితో పాటు, డెంగ్యూ కారణంగా కిడ్నీ, లివర్ ఫెయిలయ్యాయని, డెంగ్యూ షాక్‌తో బాలిక మృతి చెందినట్లు ఆసుపత్రి డాక్టర్ తెలిపారు. డెంగ్యూ కారణం అని ప్రైవేటు వైద్యుడు చెపుతున్నా బాలిక మృతికి డెంగ్యూ కారణం కాదని ప్రభుత్వ అధికారులు చెప్పటం కొసమెరుపు. అంటే ఇక్కడ ఆర్‌ఎంపీ రెండు రోజుల పాటు బాలికకు ఇష్టారీతిన వైద్యం చేయటం తప్పయితే ప్రైవేటు ఆసుపత్రిలో డెంగ్యూ పేరుతో వైద్యం చేయటం మరో ఘోర తప్పిదంగా బావించాలి. కాని ఇంత జరిగి ఒక నిండు ప్రాణం పోయినా సంబంధిత అధికారులు మాత్రం ఫిర్యాదు లేదనే సాకుతో ఇక ఆర్‌ఎంపీపైనా, సదరు ఆసుపత్రి పైనా చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి.

ల్యాబ్‌లలో మాయాజాలం....

సత్తుపల్లి పట్టణం సహా నియోజకవర్గంలోని కొన్ని ల్యాబ్‌లలో పరిస్థితి మరింత దయనీయంగా ఉందని రోగులు గగ్గోలు పెడుతున్నారు. రోగ నిర్ధారణలో అవసరమైన రక్త, మూత్ర తదితర పరీక్షలకు ఒక్కో ల్యాబ్‌లో ఒక్కో ఫీజును వసూలు చేస్తున్నారు. అధికారులకు చూపేందుకు రికార్డులు నిర్వహిస్తున్నా అందుకు భిన్నంగా ల్యాబ్‌లలో పరిస్థితి ఉంది. కొన్ని పరీక్షా కేంద్రాల్లో థైరాయిడ్ ఇతర పరీక్షలను టెక్నీషియన్లు కాకుండా అర్హతలేని వారితో పరీక్షలు చేయి స్తూ రిపోర్టులు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. స్కానింగ్ సెంటర్లకు మహిళలు వెళ్లిన సమయంలో అక్కడ మహిళలు లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవసరం ఉన్నాలేకున్నా కొందరు వైద్యులు రక్తపరీక్షలకు రాస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పరీక్షలు చేయించకుంటే వైద్యం చేయటం లేదని చెపుతున్నారు. వైద్యుడు రాసే పరీక్ష ఒకటి అయితే అక్కడ మరో పరీక్ష చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఆర్‌ఎంపీలు వైద్యం చేయకూడదు

డాక్టర్ సీతారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో



ఆర్‌ఎంపీలు రోగులకు ఎటువంటి వైద్యం చేయకూడదని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సీతారాం తెలిపారు. ఇటీవల తమ దృష్టికి వచ్చిన సందర్భంగా కొందరికి నోటీసులు జారీ చేసామన్నారు. ఇటీవల రేగళ్లపాడు గ్రామానికి చెందిన బాలిక సత్తుపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందిన విషయంపై మాట్లాడుతూ బాలిక డెంగ్యూ కారణంగా చనిపోలేదని తెలిపారు. వేరే కారణాల వల్ల చనిపోయిందన్నారు.

‘సీతారామ’ జలాలు ఇస్తేనే సీఎం సభకు..

- భద్రాద్రి జిల్లాకు రాకుండా ఖమ్మం జిల్లాకు తరలించుకుపోతున్నారని ఎమ్మెల్యే ఎదుట కాంగ్రెస్ నాయకుల ఆవేదన
- గోదావరి జలాలు అందిస్తామని హామీ ఇస్తేనే సీఎం సభకు జనాన్ని తరలిస్తామని రాందస్‌నాయక్‌కు చెప్పిన నాయకులు



ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తంచేస్తున్న స్థానిక నాయకులు

జూలూరుపాడు, ఆగస్టు 10: సీతారామ ప్రాజెక్ట్ జూలూరుపాడు మండలం నుంచి వెళుతున్నప్పటికి ఈ మండలంలోని రైతులకు గోదావరి జలాలను అందించకుండా ఖమ్మం జిల్లాకు నీటిని తరలిస్తుంటే 15న వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు రైతులు, ప్రజలను ఎలా తీసుకురావాలని కొంతమంది పార్టీ నాయకులు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జూలూరుపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బహిరంగ సభకు మండలం నుంచి జన సమీకరణపై చర్చించేందుకు పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొన్నారు. సీఎం సభకు మండలం నుంచి భారీగా ప్రజలు, రైతులను తరలించే విదంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ క్రమంలో జూలూరుపాడుకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు రోకటి రంగారావు, నర్వనేని పుల్లారావు, పాపకొల్లు గ్రామానికి చెందిన రామిశెట్టి రాంబాబు మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా రైతులకు సీతారామ జలాలను ఇవ్వకుండా ముగ్గురు మంత్రులు కలసి రైతులకు అన్యాయం చేస్తూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను తీసుకువెళుతుండటంతో గ్రామాలలో రైతులు, ప్రజలు తమను నిలదీస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో సీఎం బహిరంగ సభకు జనాన్ని ఎలా తరలించాలని వారు అన్నారు. జూలూరుపాడు మండలంతో పాటు భద్రాద్రి జిల్లాకు సీతారామ జలాలను ఇస్తామని హమీ ఇస్తేనే జనాలను సభకు తీసుకు వస్తామని వారు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైరా నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సీతారామ నీటిని అందిస్తానని తెలిపారు. సీఎం సభకు జనాన్ని అధిక సంఖ్యలో తరలించి విజయవంతం చేయాలని సదరు నాయకులకు సూచించారు.

అన్ని రంగాల్లో రక్షణ చర్యలు తీసుకోవాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సింగరేణి సీఎండీ బలరాం ఆదేశం
- అన్ని ఏరియాల్లో రక్షణపై అవగాహన



సీఎండీతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సింగరేణి అధికారులు

కొత్తగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి అన్ని ఏరియాల్లో రక్షణపై అవగాహన కల్పించేందుకు అన్ని మైన్స్, డిపార్టుమెంట్ పిట్ సేఫ్టీకమిటి, మైన్స్‌కమిటీ సభ్యులతో సింగరేణి సీఎండీ ఎన్. బలరాం శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సింగరేణి సంస్థలోని అన్ని ఏరియాల్లో జనరల్ మేనేజరు, అధికారులు, పిట్‌సేఫ్టీ, మైన్స్‌కమిటీ సభ్యులుతో వారి వారి ఏరియాలో పాల్గొన్నారు. కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీవోఏ క్లబ్ రుద్రంపూర్‌లో కొత్తగూడెం ఏరియా జీఎం సమక్షంలో కొత్తగూడెం ఏరియాలోని అన్ని మైన్స్, డిపార్టుమెంట్ అధికారులు, సంబందిత పిట్‌సేఫ్టీ కమిటి, మైన్స్‌కమిటీ సభ్యులతో సుమారు 200మంది సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. సీఎండీ బలరాం మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జరుగుతున్న సీరియస్, రిపోర్టబుల్ యాక్సిడెంట్లుపై వివరించారు. సింగరేణి సంస్థలో జీరో హర్మ్, జీరో రిపోర్టబుల్ నినాదంతో ఉత్పత్తిని సాధించాలన్నారు. వివిధ రక్షణ అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి ప్రమాదం జరిగిన తర్వాత అప్రమత్తంగా ఉండటం కాకుండ ముందుగానే పని చేస్తున్న స్థలాలను పరిశీలించి రక్షణ సూత్రాలను పాటిస్తే ఎటువంటి ప్రమాదం జరగదన్నారు. ప్రతి ఉద్యోగి ఇంటి నుంచి బయలు దేరినప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని దాని కొరకు కూడా 'నా రక్షణ నా బాధ్యత నా రక్షణ కుటుంబభద్రత' అనే అవగాహస సదస్సుతో సింగరేణి మొత్తంలో ప్రతి ఒక్కరు రక్షణతో ఎలా పని చేయాలో అవగాహన కల్పించడం చేస్తున్నామని వివరించారు. ప్రతి ఉద్యోగి వారి తోటి ఉద్యోగులకు రక్షణ ఆవశ్యకతను తెలియచేస్తూ సంస్థ ఉత్పత్తిలో పాల్గొనాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌వోటు జీఎం ఎం. జీవికోటిరెడ్డి, అధికారులు రవీందర్, రమేష్, వెంకటేశ్వరరావు, ప్రహ్లాద, ఎంవి. నర్సింహారావు, సోమశేఖర్, శ్రీకాంత్, పాలడుగు శ్రీనివాస్, సత్యనారాయణ, ఇతర అధికారులు కొత్తగూడెం ఏరియాలోని యూనియన్ ప్రతినిధులు ఎండి. రజాక్, రమణమూర్తి, సముద్రాల సుధాకర్, అన్ని మైన్స్‌డిపార్టుమెంట్‌లోని పిట్ సేఫ్టీ కమిటీ, మైన్స్‌కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనం చెంతకు వెళ్లి.. సమస్యలు తెలుసుకొని..

- వైఎస్ఆర్ నగర్‌లో మంత్రి తుమ్మల
- గుట్టలపైన అధికారులతో కలిసి పర్యటన
- గ్రామసభలో రూ.4 కోట్ల నిధులు మంజూరు



స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 10: నగరంలోని 8వ డివిజన్ పరిధిలో మౌలిక సౌకర్యాల కల్పనకు కార్యచరణ చేయాలని కమిషనర్ అభిషేక్ అగస్త్యను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ వైఎస్ఆర్ నగర్‌లో శనివారం అధికారులతో కలిసి మంత్రి ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల... మేయర్ పునకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యతో మాట్లాడుతూ గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వైఎస్ఆర్ నగర్ నిర్మాణం చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో గంట పాటు ప్రజా సమస్యలను తెలుసుకున్నారు.

స్థానిక ప్రజలు మాట్లాడుతూ సీసీ రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, ఇంటి నెంబర్లు, శ్మశాన వాటిక, ప్రభుత్వ పాఠశాల, అంగనవాడి, ఆరోగ్య వైద్యసేవలు కావాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా అభివృద్ధి పనులపై ఇంత వరకు ఎందుకు కార్యచరణ చేయలేదని ఈఈ కృష్ణలాల్‌ను ప్రశ్నించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే స్థానిక కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్‌కు చెప్పాలని, ఆయన తనకు చెపితే వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. అనంతరం అక్కడే ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో స్థానికులతో కలిసి తుమ్మల పూజలు చేశారు. మేయర్ పునకొల్లు నీరజ, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు గోదుగు నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాల కొత్తపల్లి పుష్ప, భూక్య వెంకటేశ్వర్లు, షేక్ రంజాన్, గుగులోత్ శివాజీ, అబ్రహం, పాషా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుట్టలు ఎక్కి... సమస్యలు తెలుసుకుంటూ..

మంత్రి తుమ్మల నగర శివారులోని 8వ డివిజన్‌లో గుట్టలను ఎక్కి రాళ్ల రహదారిపై నడుచుకుంటూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. వీదుల వెంట బురద మట్టి ఉన్నప్పటికీ, వాటి మధ్యనే మేయర్ పునకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను వెంట తీసుకొని ప్రజా సమస్యలను స్వయంగా పరిశీలించారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో స్థానికులతో మాట్లాడారు. బడి, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రూ.4కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

భద్రాద్రికి రైలు యోగం

- పాండురంగాపురం నుంచి మల్కన్‌గిరికి కొత్త రైల్వేలైన్ మంజూరు
- దశాబ్దాల డిమాండ్‌కు ఎట్టకేలకు మోక్షం



పాండురంగాపురం రైల్వే స్టేషన్

(5వ పేజీ తరువాయి)

ద్వారా భద్రాద్రికి చేరే అవకాశం ఉంది. అయితే ఈ రైల్వేలైన్ పూర్తికావడానికి ఎన్నేళ్లు పడుతుందనేది స్పష్టత లేదు.

పాండురంగాపురం స్టేషన్‌కు మహర్దశ

పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ మండలానికి సమీప దూరంలో పాండురంగాపురం రైల్వేస్టేషన్ ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ స్టేషన్ అభివృద్ధికి నోచుకోలేదు. కనీస రహదారి కూడా లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు నిరాశేమిగిలింది. కేంద్ర ప్రభుత్వం కొత్తరైల్వే కారిడార్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాండురంగాపురం రైల్వే ప్రాజెక్టుగా రూపాంతరం కానుంది. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు పాండురంగాపురం రైల్వేస్టేషన్ నుంచి భద్రాచలం మీదుగా రాజమండ్రి వైపు రైల్వే లైన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. భద్రాచలం పుణ్యక్షేత్రానికి భక్తుల రాకపోకలకు రైల్వేలైన్ ఎంతో సౌకర్యంగా ఉంటుందని అప్పటి ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. ఈ రైల్వేలైన్.. బీపీఎల్, హెవీవాటర్ ప్లాంట్, కేటీపీఎస్ పరిశ్రమలతో పాటు సింగరేణి బొగ్గు సరఫరాకు, ప్రజల రాకపోకలకు దోహదపడే విధంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాండురంగాపురం రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కూడా దక్కనున్నాయి.

మల్కన్‌గిరి టూ పాండురంగాపురం

కేంద్ర ప్రభుత్వం తాజాగా గ్రీన్‌సిగల్‌ఇచ్చిన రైల్వేలైన్ ఒడిసా రాష్ట్రంలోని నవరంగ్‌పూర్, జైపోర్, మల్కన్‌గిరి, భద్రాచలం, పాండురంగాపురం వరకు విస్తరించి ఉంటుంది. మల్కన్‌గిరి మార్గంలో 170 కిలోమీటర్ల కొత్త రైల్వేలైన్‌కు 2017-18లోనే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిసింది. అందులో భాగంగా పాండురంగాపురం లైన్‌ను తాజాగా కలిపారు. పాండురంగాపురం రైల్వే ప్రాజెక్టుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతోపాటు ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కూడా అభివృద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. పాండురంగాపురం రైల్వే ప్రాజెక్టు అంచనా మొత్తం రూ. 7,383కోట్లు వ్యయం అవుతుందని రైల్వేశాఖ అంచనా వేస్తోంది.

పాల్వంచలో కొండ చిలువ హల్‌చల్..



పాల్వంచ, అగస్టు 10: పాల్వంచ హమాలీ కాలనీలో శనివారం రాత్రి కొండచిలువ హల్‌చల్ చేసింది. పక్కనే ఉన్న గుట్టపై భాగం నుంచి వచ్చిన కొండ చిలువ ఓ ఇంట్లో ప్రవేశించడంతో గుర్తించిన స్థానికులు స్నేక్ క్యాచర్ సంగయ్యకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరకున్న సంగయ్య తన సహచరులతో కలసి చాకచక్యంగా పది అడుగుల కొండచిలువకు ఎటువంటి హానీ కలుగకుండా బంధించాడు. అనంతరం దానిని మైలారం అటవీ ప్రాంతంలో వదిలివేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకుని సంగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

బుల్లెట్‌పై కేఎంసీ జవాన్ హల్‌చల్

● బాలుడితో డ్రైవింగ్ చేస్తూ వీరంగం



ద్విచక్రవాహనపై బాలుడితో జవాన్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 10: కేఎంసీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య జవాన్ మద్యం మత్తులో బాలుడుతో బుల్లెట్ ద్విచక్ర వాహనం ప్రమాదభరితంగా నడిపిస్తూ ఖమ్మం మున్సిపల్ కార్యాలయం నుంచి సరితా క్లినిక్ సెంటర్ వరకు ప్రధాన రహదారిపై శనివారం వాహనదారులును బెంబేలెత్తించారు. అంతేకాదు తమ ప్రతాపాన్ని మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న స్నేహితులతో వీడియో తీయించి స్నేహితులకు షేర్ చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

‘సీతారామ’ ప్రాజెక్టు ఘనత మాదే..

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 90శాతం పనుల పూర్తి
- కేవలం లింక్ కెనాల్ తవ్వించి గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్
- సత్తుపల్లికి ఎవరు ఎమ్మెల్యేనో తెలియని పరిస్థితి వుంది..
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



తాజా, మాజీ ఎంపీపీలను సన్మానిస్తున్న సండ్ర

సత్తుపల్లి, ఆగస్టు10: ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను మళ్లించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం మంజూరు చేసి 90శాతం పనులు పూర్తిచేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేవలం లింక్ కెనాల్ తవ్వించి పనులన్నీ తామే చేయించినట్లు ఇప్పటి ప్రభుత్వం చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. సత్తుపల్లిలో శనివారం ఆయన తాజా, మాజీల ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీల సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. రుణమాఫీ 35శాతం మందికి కూడా కావడం లేదని రైతులు చెబుతున్నారని అన్నారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం హామీ ఇంతవరకు అమలు కాలేదని, ప్రజలు ఇవన్నీ గమనిస్తూనే ఉన్నారని అన్నారు.

రాష్ట్రప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని, ఇప్పటివరకు వేచి చూశామని, రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని, అందుకు పార్టీ కేడర్ సమాయత్తం అవ్వాలని పిలుపునిచ్చారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాను మాత్రమే ఎమ్మెల్యే అంటూ ఫోన్‌లో మాట్లాడేవాడినని, కానీ ఇప్పుడు ఎవరెవరో ఎమ్మెల్యేలంటూ ఫోన్లలో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు కూడా నిర్వహించలేని పరిస్థితిలో ఉందని అన్నారు. దీనివలన గ్రామాలలో బాధ్యుడు, జవాబుదారీతనం కొరవడిందని అన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు తేడా ప్రజలు గమనిస్తున్నారన్నారు. గత ఐదేళ్ల కాలంలో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు అంకితభావంతో ప్రజలకు సేవలు అందించారని, ఇదే స్ఫూర్తితో ఆయా నాయకులు ముందుకు సాగాలని కోరారు.

ఈ సందర్భంగా సత్తుపల్లి, వేంసూరు తాజా మాజీ ఎంపీపీలు దొడ్డా హైమావతి శంకరరావు, పగుట్ల వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామా రావు, మారోజు సుమలత సురేష్‌లతో పాటు రెండు మండలాల ఎంపీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ మెంబర్లను ఆయన సన్మానించారు. కార్యక్రమం లో బీఆర్ ఎస్ సత్తుపల్లి, వేంసూరు మండలాల అధ్యక్షులు యాగంటి శ్రీనివాసరావు, పాల వెంకటరెడ్డి, మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమా మహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఎస్‌కే.రఫీ, కాల్నేని వెంకటేశ్వరరావు, తుంబూరు సరస్వతి దామోదరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేను నాటక అభిమానిని

● తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల కార్యక్రమంలో మంత్రి తుమ్మల





నాటకాన్ని తిలకిస్తున్న మంత్రి తుమ్మల, మాట్లాడుతున్న సినీ నటుడు శ్రీనివాసరెడ్డి

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 10: 'నేను నెలనెల వెన్నెల, నాటక అభిమానినని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నెలనెల వెన్నెల 7వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల కార్యక్రమం శనివారం ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల హజరై నేను ఈ రోజు ప్రేక్షకుడిగా మాత్రమే విచ్చేసానని, నటీనటులు అద్భుతంగా నటించారని, ఇటువంటి నాటికలు ఎంపిక చేసి ఖమ్మం ప్రేక్షకులకు అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కళాక్షేత్రానికి, కళాకారుల సమస్యలు ఉంటే నేరుగా కలిసి వివరించాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. మరో అతిథి ఖమ్మం నగారానికి చెందిన సినీనటుడు శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మంత్రి తుమ్మలతో కలిసి నాటిక చూడటం నా అదృష్టంగా బావిస్తున్నాను అన్నారు. గతంలో కూడ నేను ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. 'దారుణం' నాటికలో సోషల్‌మీడియలో స్వేచ్ఛ ఉన్నదికదా అని హద్దులు దాటి ప్రవర్తించవద్దని అది ప్రమాదాలకు దారితీస్తుందని ఈ నాటికలో చూపించిన తీరు అద్భుతంగా ఉందన్నారు. నా ఖమ్మం గడ్డమీద ఏడు సంవత్సరాలుగా పాత కళలను, కళాకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. దారుణం నాటిక బృందానికి పారితోషకం అందించారు. అనంతరం శ్రీనివాసరెడ్డిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రదర్శించిన 'అందిన ఆకాశం', 'సంపద' నాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుబ్రమణ్యకుమార్, జగన్మోహన్‌రావు, విజేత, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అంతిమ సంస్కారాలు నిర్వహించే వైకుంఠ దామాల వద్ద కాసుల పంచాయతీ ఖమ్మం నగరంలో పెద్ద సమస్యగా మారింది. వర్షా కాలం కావడంతో నగర పరిధిలోని రెండు ప్రధాన వైకుంఠదామాలకు వరద ముప్పు పొంచి ఉండటంతో బల్లేపల్లి వైకుంఠదా మానికి డిమాండ్ పెరిగింది. దీంతో ఇక్కడ ఎక్కువ చార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక్కడ పనిచేసే కాటి కాపరులకు ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి వేతనాలు అందకపోతుండటంతో చార్జీలపై నియంత్రణ లేకుండా పోయిం దనే విమర్శలున్నాయి.



కాటికాడ..
కాసుల పంచాయితీ

నగరంలో ఒక్కో వైకుంఠదామంలో ఒక్కో ధర

- కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ వైకుంఠదామాలకు పొంచి ఉన్న ముంపుభయం
- మైదాన ప్రాంతంలో నిర్మించిన బల్లేపల్లి వాటికకు డిమాండ్
- ధరలు నిర్ణయించకుంటే వర్షాకాలంలో శవ జాగారాలే

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 10: ఖమ్మం నగరంలోని 60 డివిజన్‌లలో 4 లక్షలకు పైగా జనాభా ఉంది. హిందువుల కోసం ప్రధానంగా ప్రకాశ్‌నగర్, కాల్వొడ్డు, బల్లేపల్లి వైకుంఠదామాలు ఉన్నాయి. వీటితో పాటుగా అల్లీపురం, టేకులపల్లిలో స్థానికంగా చిన్న వైకుంఠదామాలు ఉన్నాయి. వీటిలో నెలకు సుమారు 55వరకు భౌతికకాయాలకు అంత్యక్రియలు జరుగుతుంటాయి. ప్రకాశ్‌నగర్, కాల్వొడ్డు పురాతనమైన వైకంఠదామాలు కాగా, బల్లేపల్లిలోనిది మాత్రం పదేళ్ల నుంచి అందుబాటులోకి వచ్చింది. ప్రకాశ్‌నగర్, కాల్వొడ్డు వైకుంఠదామాలు ఎప్పటి నుంచో ఉండగా, అక్కడ తరతరాలుగా పనిచేస్తున్న జాంబవంతులు(కాటి కాపరులు) ఇద్దరు నుంచి ముగ్గురు వరకు ఉండటంతో వారికి ఖమ్మం నగరపాలక సంస్థ నుంచి లైసెన్స్‌లు మంజూరు చేసి, ప్రతీ నెల వేతనాలు చెల్లిస్తున్నారు. అయితే పదేళ్ల క్రితం నిర్మించిన బల్లేపల్లి వైకుంఠదామంలో ప్రస్తుతం 12మంది జాంబవంతులు పనిచేస్తున్నారు. కరోనా సమయంలో మరణించిన వారికి బల్లేపల్లిలోనే ఎక్కువ అంత్యక్రియలు నిర్వహించారు. కానీ ఇక్కడ పనిచేస్తున్న 12మంది జాంబవంతులకు ఖమ్మం నగరపాలక సంస్థ నుంచి లైసెన్స్‌లు వేతనాలు ఇవ్వడం లేదు. తరతరాలుగా పనిచేస్తున్న కొంత మంది మాత్రమే కొద్దిపాటి వేతనాలను పొందుతున్నారు.

ఒక భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించాలంటే సుమారు 8 క్వింటాళ్ల కట్టెలు, 5 నుంచి 7 లీటర్లు డీజిల్, పాడె బడితెలు, పురికొన, గడ్డి మొత్తం కలిపి రూ.5వేల ఖర్చు అవుతుంది. బల్లేపల్లి వైకుంఠదామంలో 12 మంది పనిచేస్తుండగా ఎవరైనా చనిపోయారని కబురొస్తే వారిలో ఐదుగురు మృతుడి ఇంటివద్దకు వెళ్లి పాడె ఏర్పాట్లు చేస్తారు. మిగిలిన వారు వైకుంఠదామంలో ఏర్పాట్లు చేస్తారు. ఇలా ఇక్కడ ఎక్కువ మంది జాంబవంతులు పనిచేస్తుండటంతో ఒక్కొక్క అంత్యక్రియకు వీరు కనీసం రూ.10వేల నుంచి రూ.12వేల వరకు తీసుకుంటున్నారని తెలుస్తోంది. బల్లేపల్లి వైకుంఠదామానికి అనాథ, గుర్తింపు లేని మృతదేహాలు వచ్చిన సమయంలో మెయింటెనెన్స్ మాత్రమే తీసుకొని అంత్యక్రియలు చేస్తున్నారు.

ఆదే ప్రకాశ్‌నగర్, కాల్వొడ్డులో జాంబవంతుల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రభుత్వం నిర్ణయించిన రూ.6వేల నుంచి రూ.7వేల వరకు వసూలు చేస్తున్నారు.

మృతదేహాలపై పంచాయితీ

ఖమ్మం నగరంలో డివిజన్ల వారీగా వైకుంఠదామాలను కేటాయించారు. మొదటి ఐదు డివిజన్లకు బల్లేపల్లి వైకుంఠదామం కేటాయించారు. అయితే ఆధునీకంగా ఉన్న బల్లేపల్లి వైకుంఠదామానికి భౌతికకాయాలను పంపేందుకు నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి మృతుల బంధువులు ఆసక్తి చూపుతారు. ఈ క్రమంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భౌతికకాయాలకు రూ.15వేల వరకు ఇవ్వాలని బల్లేపల్లి జాంబవంతులు అడుగుతున్నారని ఇతర డివిజన్ల కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఖానాపురానికి సమీపంలోనే బల్లేపల్లి వైకుంఠదామం ఉన్నా ప్రకాశ్‌నగర్ వరకు పంపాల్సి వస్తోందని, అంత్యక్రియల నిర్వహణకు ఒకే ధర నిర్ణయించాలని కార్పొరేటర్లు కోరుతున్నారు.

ప్రకాష్‌నగర్, కాల్వొడ్డుకు వరద ముప్పు

వర్షాకాలంలో మున్నేరుకు వరద పొంగితే ప్రకాష్‌నగర్, కాల్వొడ్డు వైకుంఠదామాలు పూర్తిగా నీట మునుగుతాయి. ఆ రోజుల్లో బల్లేపల్లి వైకుంఠదామమే ఖమ్మంనగరం మొత్తానికి అంత్యక్రియలకు అందుబాటులో ఉంటుంది. ఈ క్రమంలో బల్లేపల్లిలో పనిచేస్తున్న 12మంది జాంబవంతులకు లైసెన్స్‌లు మంజూరు చేసి వారికి నగర పాలక సంస్థ ద్వారా వేతనాలు చెల్లిస్తే ప్రకాశ్‌నగర్, కాల్వొడ్డులో వలే ఆదే ధరలకు అంత్యక్రియలు నిర్వహిస్తామని జాంబవంతులు కోరుతున్నారు. మున్నేరుకు వరద ముంపు వచ్చి రెండు వైకుంఠదామాలు ముంపునకు గురి కాకముందే ఈ పంచాయితీని ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

ఒకే ధర నిర్ణయించేందుకు చర్చలు
- సంపత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్



ఖమ్మంనగరంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు మూడు పెద్దవి, మరో రెండు చిన్న వైకుంఠదామాలు ఉన్నాయి. ప్రకాశ్‌నగర్, కాల్వొడ్డులో ఒక్కో భౌతిక కాయం అంత్యక్రియలకు రూ.6వేలు ధర నిర్ణయించాం. వాటిలోనే జాంబవంతులు అంత్యక్రియలకు కావాల్సిన వాటిని తెప్పించుకోవాల్సి ఉంటుంది. బల్లేపల్లి వైకుంఠదామంలో అంత్యక్రియల విషయంలో కొంత ధరల ఇబ్బంది ఉంది. త్వరలో అన్ని వైకుంఠదామాల వద్ద ఒకే నిర్ణీత ధర బోర్డులను ఏర్పాటు చేస్తాం.

గ్రానైట్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● రాష్ట్ర చిన్నతరహా గ్రానైట్ పరిశ్రమల అధ్యక్షుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 10: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలో ఉన్న గ్రానైట్ పరిశ్రమల, క్వారీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర చిన్నతరహా గ్రానైట్ పరిశ్రమల అధ్యక్షుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని ఓ హోటల్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల, రాష్ట్ర గ్రానైట్ అసోషియేషన్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రానైట్ పరిశ్రమ ప్రధాన సమ స్య అయినటువంటి ముడిసరుకు కావాలంటే క్వారీ లీజులు సరళీకృతం చేసి, పాత పద్ధతిలో (ఐదు హెక్టార్లలోపు అనుమతులు ఇచ్చే లీజులకు ఈసీ, పొల్యూషన్ లేకుండా) ఇవ్వాలని, తాత్కాలిక లీజులు మంజూరు చేస్తే గ్రానైట్ పరిశ్రమ మనుగడ సాధ్యపడుతుందని అసోషియేషన్ సభ్యులు రాయల దృష్టికి తీసుకువచ్చారు. పెరిగిన షైనింగ్ రాయల్టీని తగించే విధంగా చూడాలని కోరారు. ప్రభుత్వ భవనాలకు, రైల్వేస్టేషన్‌లకు స్థానికంగా ఉండే గ్రానైట్‌ను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడు తూ ఈ అంశాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి నావంతు కృషిని తప్పకుండా చేస్తానన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి, గ్రానైట్ పరిశ్రమ, క్వారీ యజమానులతో పాటు అధికారులతో హైదరాబాద్‌లో ఒక సదస్సును ఏర్పాటు చేస్తే ముఖ్య సమస్యలను పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. అందుకు నావంతు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా గ్రానైట్ స్లాబ్ పరిశ్రమల అసోషియేషన్ అధ్యక్షుడు ఉప్పలపాటి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు చక్రదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శరా బందు, రాష్ట్ర కోశాధికారి పాటిబండ్ల యుగంధర్, పారా నాగేశ్వరరావు, పుసులూరి నరేంద్ర, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను గ్రామీణ ప్రజల్లోకి తీసుకెళ్లాలి

•జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి



మొక్క నాటుతున్న పోస్టల్ సిబ్బంది

మధిర, ఆగస్టు 10: పోస్టల్ శాఖ సేవలను గ్రామీణ ప్రాంతాల ప్రజల్లోకి విస్తృతంగా తీసెకెళ్లాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ జీ. వీరభద్రస్వామి సూచించారు. శనివారం మధిరలో డివిజన్ స్థాయి పోస్టల్ అధికారులు, పోస్టు మాస్టర, సిబ్బంది సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పోస్టల్ ఉద్యోగులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజల్లోకి పోస్టల్ సేవలను బలంగా విస్తృతంగా తీసుకెల్లడంద్వారా భారత్ ప్రభుత్వంలో పోస్టల్‌శాఖను అగ్రభాగాన నిలపాలని కోరారు. చిన్నమొత్తాల పొదుపు పథకాలైన ఎస్‌బీ, ఆర్‌డీ, ఎస్ఎస్ఏ, టర్మ్‌డిపాజిట్ పథకాలను గ్రామీణ ప్రాంతాల్లో బాగా ఆదరిస్తున్నారని, వృద్ధాప్య పింఛన్లు, ఉపాధి హామీ ద్వారా కూలీలకు డబ్బులు చెల్లించడం ద్వారా గ్రామీణ ప్రజలు ప్రయోజనం పొందుతున్నారన్నారు. వీటితో పాటు మహిళా సమాన్ యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలు ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల్లో బ్యాంకులకువెళ్ల కుండా పోస్టల్ పేమెంట్ బ్యాంకు వినియోగించుకొనేలా చైతన్యం కలిగించాలని కోరారు. రూ.530 చెల్లిస్తే 10లక్షల ఇన్సూరెన్స్, 750 చెల్లిస్తే 15లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడం జరుగుతుందని, పోస్టల్ శాఖ నూతనంగా అమలుచేస్తున్న పథకాలను వివరించారు. ఈసందర్భంగా పోస్టల్ సిబ్బంది మొక్కను ఎస్‌పీకి బహుమతిగా అందజేసి సన్మానించారు. అనంతరం పోస్టాఫీస్ ఆవరణలో ఎస్‌పీ చేత మొక్క నాటడం జరిగింది. ఈకార్యక్రమంలో పోస్టల్ ఇన్స్‌పెక్టర్ కోటేష్, పోస్టు మాస్టర్లు, సబ్ పోస్టుమాస్టర్లు, డివిజన్‌లోని ఇతర పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన భద్రాద్రి కలెక్టర్ పాటిల్



హైకోర్టు జడ్జి నగేష్‌కు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

బూర్గంపాడు, ఆగస్టు 10: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి భీమపాక నగేష్‌ని శనివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మర్యాద పూర్వకంగా కలిశారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల ఐటీసీ గెస్ట్‌హౌజ్‌లో జడ్జిని కలిసిన కలెక్టర్ మొక్కను అందజేశారు. అనంతరం స్థానిక పరిస్థితులపై వివరించారు.

మృతదేహం లభ్యం

మధిరరూరల్, ఆగస్టు 10: మధిర మండలం జాలిముడి ప్రాజెక్టు వద్ద ఏటిలో శనివారం ఓ మృతదేహం లభ్యమైంది. కాగా మృతదేహం నీళ్లలో కన్పించగా చుట్టూ పక్కల రైతులు చూసి మధిర రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి తమ సిబ్బందితో పాటు ఆర్కే ఫౌండేషన్ రెస్క్యూటీంతో కలిసి మృతదేహాన్ని శనివారం వెలికితీశారు. మూడు రోజుల క్రితం చనిపోయి, 15అడుగుల లోతులో ఉన్న మృతదేహాన్ని వెలికితీశారు. వైరా మండలం లింగన్నపాలెం గ్రామానికి చెందిన బోళ్ల కృష్ణ(55)గా గుర్తించారు. అయితే ఇతను నాలుగు రోజులుగా కన్పించకపోవడంతో సమాచారం అందుకున్న మృతుడి బంధువులు మృతదేహం వద్దకు వచ్చి చూసి తమ వ్యక్తేనని నిర్ధారించుకున్నారు.

కొత్తగూడెంలో ..



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు10: కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిలో గుర్తు తెలియని మృతదేహం ఉందని....ఆచూకీ తెలిసిన వారు సమాచారం తెలియజేయాలని కొత్తగూడెం త్రీ టౌన్ ఎస్ఐ పురుషోత్తం శనివారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు గల వ్యక్తి కొత్తగూ డెం జనరల్ హాస్పిటల్ ప్రదేశంలో చనిపోయి ఉన్నాడని, హాస్పిటల్ డ్యూటీ డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు చేసినట్లు తెలి పారు. ఈ మేరకు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదే హాన్ని మార్చురీ గదిలో భద్రపరిచామని ఎవరైనా గుర్తు పట్టిన వారు 87126 82027, 87126 82026 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

యువతి అదృశ్యం

●ఉల్వనూర్‌లో ఘటన

పాల్వంచ, అగస్టు 10 : యువతి అదృశ్యమైన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉల్వనూరుకు చెందిన పల్లపు శిరీష(19) చదువు మానేసి ఇంట్లోనే ఉంటుంది. శుక్రవారం ఆమె తల్లి ఎల్లమ్మ మేకలు కాయడానికి వెళ్లగా, తండ్రి పత్తి చేనులో మందు కొట్టడానికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న ఆమెకు తల్లి ఎల్లమ్మ సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో, ఫోన్ చేసి ఎదురురమ్మని చెప్పింది. తల్లికి ఎదురు వెళ్లిన ఆమె అటవీ ప్రాంతంలోని ఒర్రె వద్దకు వెళ్లి అదృశ్యమయ్యింది. ఒర్రె వద్ద తనకు కనిపించి, మరలా అదృశ్యమైన తన కుమార్తె ఆచూకీ కోసం ప్రక్కనే పత్తి చేనులో ఉన్న ప్రవీణ్‌ను ఆరాతీసింది. అతను కూడా ఇప్పుడే ఒర్రె వైపు వెళుతుండగా చూసానని చెప్పాడు. దీంతో ఎల్లమ్మ శిరీష కోసం ఒర్రె ప్రాంతంలో గాలించింది. అనంతరం ఇంట్లో, చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా, ఎంతకూ ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు ఉమన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

'బొగ్గు పరిశ్రమ కాంట్రాక్టు కార్మికులకు భద్రత కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బీఎంఎస్ జాతీయ నాయకుడు రాజారెడ్డి

ఇల్లెందు, ఆగస్టు 10: దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, కోల్‌ఇండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు సింగరేణిలో చెల్లించాలని బీఎంఎస్ నాయకుడు, జాతీయ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పులి రాజారెడ్డి బొగ్గు గనుల యాజమాన్యాలను కోరారు. బీహార్ రాష్ట్రంలోని రాంచిలో ఈ నెల 9,10తేదీల్లో బొగ్గు పరిశ్రమ కాంట్రాక్టు కార్మికుల మానిటరింగ్ సమావేశాలు జరిగాయి. సెంట్రల్ కోల్ ఫీల్డ్స్(సీ.సీ.ఎల్) నిర్వహించిన ఈ సమావేశంలో బీఎంఎస్, హెచ్ఎంఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నా రు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు కోల్‌ఇండియా దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టు కార్మికులుకు సీఎంపీఎస్, ఈఎస్ఐ, పీఎల్ఆర్ఎస్ పేడేలు, పీహెచ్‌డీలుపర్మినెంట్ కార్మికుల మాదిరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాంచిలోని వివిధ ఏరియాల బొగ్గు పరిశ్రమ విభాగాలు కార్మిక సంఘాల ప్రతినిధులు సందర్శించారు. ఈ సమావేశంలో సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్, మహానది కోల్‌ఫీల్డ్స్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మంచి నీళ్లు అనుకోని దోమ మందు తాగి...

మునిసిపాలిటీ కార్మికురాలు దుర్మరణం



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు (ఇన్‌సెట్‌లో ఓదెమ్మ(ఫైల్))

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు10: ప్రమాదవశాత్తూ మంచి నీళ్లు అనుకోని, దోమ మందు తాగి మునిసిపాలిటీ కార్మికురాలు మృతి చెందిన సంఘటన కొత్తగూడెం మునిసిపాలిటీలో శనివారం చోటు చేసుకుంది. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం మునిసిపాలిటీలోని 8వ వార్డులో పని చేస్తున్న పారిశుద్య కాంట్రాక్ట్ కార్మికురాలు బత్తుల ఓదెమ్మ(50) మంచి నీరు అనుకోని, నీళ్ల బాటిల్లో ఉన్న దోమ మందు తాగి అస్వస్థతకు గురైంది. తోటి కార్మికులు గుర్తించి ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

కాగా ఓదెమ్మ మృతికి మునిసిపల్ అధికారులే కారణమని వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ, సీపీఎం నాయకులు కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి మార్చురీ వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు. అస్వస్థతకు గురైన ఆమెకు వైద్యం అందించేందుకు వెంటనే మునిసిపల్ అధికారులు స్పందించలేదని ఆరోపించారు. మృతురాలి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్ జలాల్, లిక్కి బాలరాజు, యెర్రా కామేష్,సాయి, మృతురాలి కుమార్తెలు సరోజ, నాగలక్ష్మి, ఉషా, కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

ఓదెమ్మ కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కార్మికురాలు ఓదెమ్మ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మృతురాలి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో మాట్లాడి హామీ ఇచ్చారు. అదే విధంగా తక్షణమే సహాయంగా రూ.3లక్షలు, అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు అందజేయాలని మునిసిపాలిటీ అధికారులతో మాట్లాడి మంజూరు చేయించారు. ఎమ్మెల్యేతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా ఓదెమ్మ మృతి వార్త తెలుసుకొని విచారణ వ్యక్తం చేశారు. ముని సిపాలిటీ కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ధర్మారాజు, యూసఫ్, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణాచారి, గెద్దాడు నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, కె.రత్నకుమారి, మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్ షమీమ్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బీసీ సత్యాగ్రహ దీక్షకు మద్దతు తెలిపిన వద్దిరాజు

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు10: కులగణన చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సత్యాగ్రహ దీక్షను శనివారం రాజ్యసభ సభ్యు డు, బీఆర్ఎస్ రాజ్యసభ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా వద్దిరాజు మాట్లాడుతూ చట్టసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల న్యాయమైన వాటా కల్పించాలని అన్నారు. జనాభాలో సగ భాగం కంటే ఎక్కువ ఉన్న బీసీలకు రాజకీయాలలో తీవ్రఅన్యాయం జరుగుతుందన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయకపోవడం బాధాకరమన్నారు. అలాగే రాష్ట్ర మంత్రివర్గంలో కూడా బీసీలకు సముచిత స్థానం దక్కలేదన్నారు.

కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెరిగేలా కృషి చేయాలి: సీపీ

ఖమ్మంక్రైం, ఆగస్టు10: కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెరిగేలా కృషిచేయాలని సీపీ సునిల్‌దత్ అన్నారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు ఒకరోజు శిక్షణలో భాగంగా శనివారం తన కార్యాలయంలో శిక్షన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులకు శిక్షలు పడడంలో కోర్టు డ్యూటీ అధికారుల పాత్ర కీలకమన్నారు. కోర్టులో చార్జిషీటు వేసిన ప్రతి కేసులో నిందితులకు శిక్షపడేలా సమన్వయంతో పనిచేయాలని, తద్వారా నేరాలకు పాల్పడితే శిక్షపడుతుందనే భయాన్ని నేరస్తులకు కలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో సీసీఆర్‌బీ సీఐ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

● మరో ముగ్గురికి గాయాలు



దీపక్(ఫైల్)

దుమ్ముగూడెం, ఆగస్టు 10: రోడ్డు ప్రమాదంలో దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమపాఠశాల విద్యార్థి ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు స్వల్ప గాయాలైన సంఘటన సరిహద్దు ఏపీ రాష్ట్రం ఎటపాక పోలీస్‌స్టేషన్ పరిధిలోని తునికిచెరువు ప్రధాన రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బండారుగూడేనికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి కుంజా దీపక్(13), కుంజా అనీల్, కాటిబోయిన జశ్వంత్, కాటిబోయిన కార్తీక్‌లు శనివారం ఉదయం విద్యార్థులంతా కలిసి ఆశ్రమపాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. మార్గమధ్యలో తునికిచెరువు వద్ద గుర్తు తెలియని వాహనం ఒకటి ఎదురుగా ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవరు వాహనాన్ని వదిలిపెట్టి పరారవగా, ఢీకొట్టిన వాహనం సైతం ఆగకుండా వెళ్లిపోయింది. వెనుకగా మరో ఆటోలో వస్తున్న వాళ్లు గమనించి, విద్యార్థులను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే దీపక్ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనం కారుగా ప్రమాదస్థలంలో ఉన్న కొందరు వ్యవసాయ కూలీలు గుర్తించి ఎటపాక పోలీసులకు సమాచారం అందించారు. కారు, ఆటోలు రెండూ మండలంలోని ఓ మారుమూల ప్రాంతాలకు చెందినవిగా తెలుస్తోంది. ఇప్పటికే కారు యజమాని స్వగ్రామాన్ని ఎటపాక పోలీసులు సందర్శించి, వాహనం ఎక్కడుందనే కోణంలో విచారణ చేసినట్లు తెలుస్తోంది. ఐతే ప్రమాదానికి కారణమైన కారును వేరే ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. అలాగే ఆటోకు సైతం బ్రేకులు లేవని తెలుస్తోంది. డీడీ మణెమ్మ, ఏటీడీవో అశోక్ ఏరియా ఆసుపత్రిని సందర్శించి జరిగిన సంఘటనపై వివరాలు సేకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎటపాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మండలంలోని పలు ఆశ్రమపాఠశాల్లో విద్యార్థుల యోగక్షేమాలను సంబంధిత అధికారులు సక్రమంగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థులు వార్డెన్ అనుమతిపై ఇళ్లకు బయల్దేరారని తెలుస్తోంది. కాగా ఎటువంటి అనుమతుల్లేకుండా పాఠశాల నుంచి గోడ దూకి పరారయ్యారని హెచ్ఎం నర్సింహారావు అంటున్నారు.

చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి....



సురేష్(ఫైల్)

వైరా, ఆగస్టు 10: మండలంలోని విప్పలమడక గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి, ఐదు రోజులు మృత్యువుతో పోరాడి శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... విప్పలమడక గ్రామానికి చెందిన బూర్గు సురేష్(29) బీఫార్మసీ చదివి ఐటీలో శిక్షణ తీసుకొని హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతని సమీప బంధువు ఒకరు మృతి చెందడంతో, స్వగ్రామమైన విప్పలమడకకు ఐదు రోజుల క్రితం వచ్చాడు. ఆతర్వాత ఆదివారం ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ వెళ్లి ఆ సమాచారాన్ని తండ్రి బాలకోటికి ఇచ్చాడు. అదేరోజు స్నేహితుల దినోత్సవం కావడంతో, మరో మిత్రుడు ఫోన్ చేయగా అక్కడకు వెళ్లిన సురేష్ రాత్రివేళ రూమ్‌కు వస్తూ, తాను ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని రోడ్డుపక్కన ఆపి మూత్రవిసర్జన చేస్తుండగా విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి అక్కడే పడిపోయాడు. ఆసమీపంలో 11కేవీ అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్ ఉండటంతో ఈ ప్రమాదం జరిగింది. లైన్ ట్రిప్పు అయిన వెంటనే సబ్‌స్టేషన్‌లో మళ్లీ కరెంట్ సరఫరాను ఆన్‌చేయగా, అక్కడే పడిపోయి ఉన్న సురేష్ రెండోసారి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆ సమయంలో లైన్ చెకింగ్‌కు వచ్చిన విద్యుత్ ఉద్యోగులకు తీవ్రంగా గాయపడి ఉన్న సురేష్ కన్పించడంతో వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని శనివారం రాత్రి విప్పలమడక తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

పోక్సో కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 10: మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్న బాలుడిపై శనివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికను 18 ఏళ్ల గల బాలుడు ప్రేమ పేరుతో వేధిస్తూ వెంటపడుతున్నాడు. అసభ్యకరంగా ప్రవరిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. దీనిపై బాలిక కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

టీడీపీ నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని వినతి

ఖమ్మం మామిళ్లగూడెం, ఆగస్టు 10: జగన్ ప్రభుత్వం మాపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ ఖమ్మం జిల్లా టీడీపీ నాయకుడు కేతినేని హరీష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ జాతీయ పోలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులుకి హైదరాబాద్‌లో శనివారం పలువురు వినతి పత్రం అందించారు. గతంలో ఆంధ్రప్రదేశ్ వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు ఖమ్మం వచ్చిన సందర్భంలో చంద్రబాబు, వారి కుటుంబం పై అనుచిత వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన సందర్భంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆ సమయంలో జరిగిన సంఘటనపై ఏపీ పోలీసులు టీడీపీ నాయకులపై కార్యకర్తలపై కేసులు నమోదు చేశారని వివరించారు. ఎఫ్ఐఆర్ కాఫీని, చార్జిషీట్ లను ఇస్తూ ఈ కేసును ఎత్తివేయాలని వారు పోలిట్‌బ్యూరో సభ్యులకు విన్నవించారు.

ఆర్టీసీ బస్సులో మహిళల మధ్య ఘర్షణ

● అశ్వాపురంలో ఘటన

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు10: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళల మధ్య జరిగిన ఘర్షణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. శనివారం కొత్తగూడెం బస్టాండ్‌లో సూర్యాపేటకు వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ బస్ ఎక్కిన ఓ మహిళ తన లగేజ్‌ను బస్సులో పైన సర్దుతుంది. ఈ క్రమంలో అశ్వాపురంలో సీట్లో కూర్చున్న మహిళలపై పడింది. దీంతో సీట్లో కూర్చున్న ప్రయాణికురాలు ఆగ్రహించింది. ఈ క్రమంలో ఇరువురు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో డ్రైవర్ బస్సును కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ముందు నిలిపివేశారు. వన్‌టౌన్ ఎస్ఐ విజయకుమారి ఇరువురి మహిళలను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం బస్సు హైదరాబాద్‌కు వెళ్లిపోయింది.

నాటుసారా విక్రేత అరెస్ట్

● బైక్ స్వాధీనం, కేసు నమోదు

పినపాక, ఆగష్టు 10: మండలంలోని దుగినేపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో శనివారం ఓ నాటుసారా విక్రేత పట్టుబడ్డాడు. మణుగూరు ఎక్సైజ్ శాఖ సీఐ రాజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుగినేపల్లి శివారులో తన సిబ్బందితో కలిసి సీఐ రాజిరెడ్డి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఓ వ్యక్తి అనుమానాస్పదంగా పోలీసులను గమనించి, పారిపోయేందుకు ప్రయత్నించిన సదరు వ్యక్తిని, ఆపి తనిఖీలు చేయగా 5 లీటర్ల నాటుసారా లభించిందన్నారు. పట్టుబడ్డ వ్యక్తిని విచారించగా తన పేరు అజ్మీర లక్ష్మయ్య అని, తనది దుగినేపల్లి గ్రామంగా వివరాలు తెలిపాడన్నారు. నాటు సారా రవాణాకు వినియోగించిన బైక్‌ను స్వాధీనం, చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రాజిరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాల్వంచ, అగస్టు 10: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. చిన్న బంగారుజాలకు చెందిన కోరం సుజన్(34) స్థానిక కేటీపీఎస్ కర్మాగారంలో రోజువారీ కూలి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జూలై 25న తన ద్విచక్రవాహనంపై కేటీపీఎస్‌కు వెళ్లాడు. తిరుగుప్రయాణంలో అర్ధరాత్రి కుంటినాగులగూడెం మలుపు వద్ద అదుపుతప్పి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు సుజన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి, అనంతరం వరంగల్‌కు తరలించారు. వరంగల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

పీఆర్‌సీని తక్షణమే ప్రకటించాలి: యూటీఎఫ్

ఇల్లెందు టౌన్, ఆగస్టు 10: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. శనివారం యూటీఎఫ్ 50వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఆవిర్భవించిన యూటీఎఫ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో స్వర్ణోత్సవాలు జరుపుకుంటుందని వివరించారు. ఉపాధ్యాయ ఉద్యమాన్ని శికరాగ్రానా నిలిపిందని ప్రకటించారు. ఉపాధ్యాయుల వి గ్రూప్ స్కేల్ సాధించడం, అప్రంటీస్ విధానం రద్దు, 2008లో 13రోజుల సమ్మె చారిత్రాత్మక ఉద్యమాలు చేసిందని వెల్లడించారు. సామాజిక స్పృహ కలిగిన సంఘంగా కోవిడ్ సమయంలో పేదలకు నిత్యావసర సరుకులు అందించిందని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎ. రాంబాబు, కార్యదర్శి టి.జయరాజు, కె.అన్నపూర్ణ, కె.శేషగిరి, కె.వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలు.. భీతిల్లుతున్న ప్రజలు

పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు

కేసులను చేధించటంలో నిఘా విభాగం వైఫల్యం

జూలూరుపాడు, ఆగస్టు 10: ఇళ్ల ముందు పార్కు చేసిన వాహనాలకు భద్రత లేదు. ఇంట్లో దాచుకున్న బంగారు ఆభరణాలు, నగదుకు రెక్కలొచ్చి దొంగల చేతిలో వాలుతున్నాయి. సెల్‌ఫోన్లు, బీఎస్ఎన్ఎల్ బ్యాటరీలకు రక్షణ కరువైంది. చోరీలకు కాదేదీ అనర్హమంటూ దొంగలు ఏది దొరికితే దానిని దొంగిలించటం, ఇళ్లల్లోకి చొరబడి దాచుకున్న సొత్తును దోచుకోవటం పరిపాటిగా మారింది. వరుసగా దొంగతనాలు జరుగు తున్నప్పటికి నిఘా విభాగం మేల్కొవటం లేదు. జూలూరుపాడు మండలంలోని పడమటనర్సాపురం, జూలూరుపాడు గ్రామాలలో వరుసబెట్టి దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. అర్ధరాత్రి సమయాలలో గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లల్లోకి చొరబడి విలువైన బంగారు నగలు, ద్విచక్ర వాహనాలు, నగదు, సెల్‌ఫోన్లను దొంగలు ఎత్తుకెళుతున్నారు. ఏడాదిగా మండలంలో ఈ సంఘటనలు వరుసగా జరుగుతున్నా పోలీసులు దొంగలను గుర్తించకపోవటం విస్మయానికి గురిచేస్తుంది.

ఇవీ వరుస చోరీలు..

గత ఏడాది జూలై నెలలో పడమటనర్సాపురం గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ఇళ్ల ముందు పెట్టిన రెండు బుల్లెట్లను దొంగలు దొంగలించారు. సెప్టెంబర్ నెలలో ఇదే గ్రామంలో ఓ ఎరువుల వ్యాపారి ఇంట్లో చోరీకి పాల్పడి నగదుతో పాటు బంగారు ఆభరణాలను ఎత్తుకువెళ్లారు. పడమట నర్సాపురంలో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ బ్యాటరీలను సైతం దొంగలించటం జరిగింది. నవంబర్‌లో ఈ గ్రామంలోని రామలయంలో అయ్యప్ప భక్తుల 8 సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. ఇదే నెలలో ఓ రైతుకు చెందిన మేకలను దొంగలించారు. ఈ ఏడాది జూలై నెలలో పడమటనర్సాపురంలో ఓ వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారు. అదే విధంగా ఓ వ్యాపారికి చెందిన కిరాణ షాపు తాళాన్ని పగలకొట్టి చోరీకి ప్రయత్నించారు. మండల కేంద్రమైన జూలూరుపాడులోని కోటమైసమ్మ తల్లి ఆలయంలో ఈ ఏడాది జూన్ నెలలో దొంగలు చొరబడి హుండీని పగలకొట్టి రూ. 10 వేలకు పైగా నగదును ఎత్తుకెళ్లారు. గత నెలలో జూలూరుపాడులోని న్యూ కాలనీలో మూడు చోట్ల చోరీలకు పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న న్యూకాలనీలో ఒకే రోజు మూడు చోట్ల చోరీలు జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురికావల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ప్రజలు బిక్కుబిక్కు మంటూ భయాందోళన చెందుతున్నారు. అభద్రత నీడలో జనం బీతిల్లుతున్నారు.



చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి (ఫైల్)

నిఘా వైఫల్యం..

దొంగలను పట్టుకోవటం, ఈ కేసులను ఛేదించటం పోలీసులకు సవాల్‌గా మారింది. చోరీలు జరిగిన ప్రతిసారి సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోవటం, ఆధారాలను సేకరించే బృందాలను రప్పించటం, వేలు ముద్రలను సేకరించటానికే పోలీసులు పరిమితమవుతున్నారని, అసలు దొంగలను పట్టుకోలేకపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

త్వరలోనే కేసులను చేధిస్తాం

ఇంద్రసేనారెడ్డి, జూలూరుపాడు సీఐ

మండలంలో జరిగిన చోరీలకు సంబంధించిన కేసులను త్వరలోనే చేధిస్తాం. చోరీల నియంత్రణకు రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత పకడ్బందీగా నిర్వహిస్తాం. ప్రజలు భయాందోళనలకు గురికావొద్దు. అనుమానిత వ్యక్తులను గుర్తించి విచారణ నిర్వహిస్తున్నాం. గతంలో చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి విచారిస్తున్నాం.

క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి

కొత్తగూడెం లీగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో భాగంగా శనివారం కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామవరం సాధనగ్రౌండ్‌లో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌వసంత్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజువారి వృత్తిలో భాగంగా మానసికంగా వృత్తిపరంగా ఒత్తిడికి గురవుతారని అలాంటి సమయంలో ఈ క్రీడల పోటీలు మానసిక ఉల్లాసంతోపాటు, మానసికంగా దృఢత్వాన్ని ఇస్తాయన్నారు. అనంతరం పోటీలను నిర్వహించగా ఆ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తిలకించారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు క్రికెట్ పోటీలు కొనసాగగా న్యాయమూర్తులు, న్యాయవాదులు ఉల్లాసంగా క్రీడా స్ఫూర్తితో క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గొల్లపూడి భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, రెండవ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కే. సాయి శ్రీ, మూడో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. శివనాయక్, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు తోట మల్లేశ్వరరావు, ఎమ్మెస్సార్ రవిచంద్ర, సాదీక్‌పాషా, దూదిపాల రవికుమార్, ఎస్. ప్రవీణ్‌కుమార్, ప్రతిభ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అడవులు అభివృద్ధి చెందాలి: సీసీఎఫ్



అధికారులతో మాట్లాడుతున్న సీసీఎఫ్

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 10: అడవులు అభివృద్ధి చెందితేనే మానవ మనుగడ సాధ్యమని, అడవుల అభివృద్ధికి అందరూ కష్టపడి పనిచేయాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా సూచించారు. అశ్వారావుపేట మండలంలో శనివారం అటవీశాఖ ఉన్నతాధికారులు పర్యటించారు. అశ్వారావుపేట, లంకాలపల్లి, ఊట్లపల్లి బీట్‌లో నూతనంగా వేస్తున్న ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ప్లాంటేషన్ పనులు, నాటిన మొక్కలను పరిశీలించారు. క్షేత్రస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలి: జీఎం

ఇల్లెందు టౌన్, ఆగస్టు 10: సింగరేణి ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తిని చేయాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ సూచించారు. శనివారం స్థానిక గనుల, విభాగాల అధికారులు, సేఫ్టీకమిటీ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం సింగరేణి సంస్థలో ప్రమాదాలను నివారించుటకు ప్రతి ఉద్యోగి తన సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. సింగరేణి సంస్థ ప్రమాదాల నివారణకు నూతన విధి విధానాలను సాంకేతిక పరికరాలను సమకూర్చుతుందని పేర్కొన్నారు. సంస్థలో పని చేసే కార్మికుల నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు రక్షణ అంశంలో పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఒకే లక్ష్యం.. ఒకే గమ్యం..ఒకే కుటుంబం అనే నినాదంతో సింగరేణి పని చేస్తుందని వెల్లడించారు. ఎలాంటి ప్రమాదాలు లేకుండ సింగరేణిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. నా భద్రత నా కుటుంబం అని తెలుసుకోవాలని కోరారు. ఉత్పత్తి, ఉత్పాదక విషయంలో అధికారులు, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, మేనేజర్లు సౌరబ్ సుమన్, పూర్ణచందర్, రక్షణ అధికారులు రాజు, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీఎం, ఇతర అధికారులు

వ్యవసాయ రంగాన్ని తాకట్టు పెడుతున్న బీజేపీ

దమ్మపేట, ఆగస్టు 10: వ్యవసాయరంగాన్ని కార్పోరేట్లకు కేంద్ర ప్రభుత్వం తాకట్టు పెడుతున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి అమర్లపూడి పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ శనివారం దమ్మపేట కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ గతనెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, రైతులకు వ్యతిరేకంగా ఉందన్నారు. సామాన్యులపై 30వేల కోట్ల రూపాయల భారం మోపి, కార్పోరేట్లకు 29వేల కోట్ల రూపాయిలు రాయతీ ఇచ్చారని ఆరోపించారు. విదేశీ కార్పోరేట్ శక్తులకు 5శాతం పన్ను మినహాయింపు చేయటాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధిపథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసారని విమర్శించారు. రైతుల, కార్మికుల హక్కులను కాపాడుకోవాలంటే క్విట్ ఇండియా స్ఫూర్తితో రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు కార్యక్రమంలో మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి ప్రభాకర్, భాస్కర్, పోతుగంటి లక్ష్మణ్, నాగేశ్వరరావు, పండూరి వీరబాబు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మణుగూరు, ఆగస్టు 10: మండలంలోని తిర్లాపురం, తోగ్గూడెం గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి చేసుకున్న సీసీ రోడ్లను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. తిర్లాపురంలో 3 తోగ్గూడెంలో 9 రోడ్లను రూ 80 లక్షల రూపాయలతో నిర్మించారని మండల పరిషత్ ఏఈ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో ఏజెన్సీలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో రోడ్లు డ్రైన్లు ఏర్పాటు చేస్తూ వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రామారావు, ఎంపీవో వెంకటేశ్వర్లు, స్థానిక గ్రామస్థులు కాంగ్రెస్ నాయకులు నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

భద్రాచలం, ఆగస్టు 10: ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో భద్రాచలం పెన్షనర్స్ భవనంలో వయో వృద్ధులకు ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ గౌడ్, ఫార్మాసిస్ట్ రత్నవలి, విజయ్‌కుమార్, పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు భూషన్‌రావు, తులసీదాస్, హన్మంతరావు, తదితరులు పాల్గొన్నారు.

‘సీఎం సభను జయప్రదం చేయండి’

జూలూరుపాడు, ఆగస్టు 10: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా ఈ నెల 15వ తేదీన వైరాలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులతో పాటు రైతులను అధిక సంఖ్యలో తరలించాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శనివారం మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ అధ్యక్షతన పార్టీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ సంబరాలతో పాటు సీతారామ పంపు హౌజ్‌లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని తెలిపారు. గ్రామాల వారీగా అధికసంఖ్యలో సభకు తరలించే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. జూలూరుపాడు మండలం నుంచి 10వేల మందిని సభకు తరలించాలని అన్నారు. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫైడ్ మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, కట్ల రంగారావు, మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదనరావు, కట్ల సంతోష్, ధారావత్ రాంబాబు, సోసైటీ అధ్యక్షుడు చీమలపాటి భిక్షం, నున్నా రంగారావు, మోదుగు రామకృష్ణ, సురేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్

ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

భద్రాచలం ఆగస్టు 10: భద్రాచలంలోని హిల్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఆర్‌వో ప్లాంట్‌ను రోటరీ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి ప్రారంభించారు. రోటరీ జిల్లా గవర్నర్‌స్నేహపూర్వక పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తరవాత స్థానిక రాఘవ నిలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో గవర్నర్ శరత్ చౌదరి మాట్లాడుతూ రోటరీ క్లబ్ భద్రాచలం ఈ గ్రామీణ ప్రాంతంలో గత 37 సంవత్సరాలుగా చేస్తున్న సేవల్ని కొనియాడారు. అలాగే భద్రాచలం క్లబ్‌కు జిల్లా నుంచి నా వంతు సహకారం అందిస్తాను అని చెప్పారు. ఈ కార్యమంలో భద్రాచలం రోటరీ క్లబ్ అధ్యక్షుడు దార బాలాజీ, కార్యదర్శి విద్యాసాగర్, కోశాధికారి శ్రీనివాస్, ఇమ్మిడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ పి. శ్రీ మహాలక్ష్మీ, ప్రెసిడెంట్ ఎలెక్ట్ పలివెల రవికుమార్, పాస్ట్ ప్రెసిడెంట్స్ రఫీ, మోత్కూరి వీరయ్య, మునికేశవ రావు, సుధాకర్ రెడ్డి, గుప్త, యశోద రాంబాబు, మధు, జాకరయ్య, అజయ్ కుమార్, నాగేశ్వరరావు, వసంత రావు, వైస్ ప్రసిడెంట్ అజీమ్, సభ్యులు చలపతి, పాషా, శేషుకుమార్, రామకృష్ణ, బాలు మహేంద్ర, ప్రసన్న, నరసింహారావు పాల్గొన్నారు.

దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని అయిలయ్య

జూలూరుపాడు, ఆగస్టు 10: సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంతో జిల్లాలో రైతులు వేలాది ఎకరాల భూమిని కోల్పోయినప్పటికీ ఆ రైతులకు సాగు నీటిని అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలిస్తూ భద్రాద్రి జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య ఆరోపించారు. శనివారం మండలంలోని వినోభానగర్ వద్ద సీతారామ లింక్ కెనాల్ నిర్మాణాన్ని రైతు సంఘం నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి దోపిడికి పాల్పడుతుందని రైతులు దీనికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయకుండానే ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంపు హౌజ్‌లను ప్రారంభిస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వంశీ కృష్ణ, సత్యనారాయణ, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు చందర్‌రావు, మధు, ఈశ్వర్ పాల్గొన్నారు.



లింక్ కెనాల్‌ను పరిశీలిస్తున్న అయిలయ్య, నాయకులు

శివాలయంలో ప్రతిష్ఠాపన వేడుకలు

ఇల్లెందు, ఆగస్టు 10: పట్టణంలోని శివాలయంలో శనివారం సతీసమేత నవగ్రహాలు, కాలభైరవ, గురుదక్షిణమూర్తి, నందీశ్వరాలయ శిఖర కళశముల ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా జరిగాయి. శైవక్షేత్రపీఠం పీఠాధిపతులు శివస్వామీజీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. 75సంవత్సరాలు పూర్తిచేసుకొన్న జగదాంబ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి(శివాలయం) ఆలయం ప్రాంగణంలో పునరుద్ధరణ వేడుకలు జరిగాయి. గత మూడు రోజులుగా జరిగిన వేడుకల్లో వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు వి.నరేష్ కుమార్, వి.నీరజ్, వి.ఆనంద్, అర్చకులువివన్నారాయణశర్మ, జగన్మోహనస్వామి, నాగభూషణశర్మ, ఆలయ మేనేజర్ ఎన్.మనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

కొత్తగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర నాల్గోవ మహాసభలు కొత్తగూడెం పట్టణంలో అక్టోబర్ 21, 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. శనివారం యూటీఎఫ్ భవన్‌లో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గ వీటి సరళ, ఉపాధ్యక్షులు జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మండల జ్యోతి, రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.అరుణజ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి కళావతి, డి. లక్ష్మి, వాణి, సంధ్య, జయశ్రీ పాల్గొన్నారు.

‘డ్రగ్స్ విక్రేతలపై చర్యలు తీసుకోవాలి’

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 10: అశ్వారావుపేటతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో యువతను నాశనం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీవైఎల్ రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు, ప్రజాపంథా జిల్లా నాయకులు గోఖినేపల్లి ప్రభాకర్ కోరారు. ఈమేరకు పీవైఎల్, పీవోడబ్ల్యూ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎస్ఐ శివరామకృష్ణకు వినతిపత్రం అందించారు. మండల పరిధిలో పిల్లలు, యువత మత్తు పదార్థాల బారిన పడుతున్నారని, వీటిని విక్రయించేవారు అధికం అయ్యారని అన్నారు. గంజాయి వంటి వాటి వలన అనేకమంది జీవితాలు నాశనం అవుతున్నాయని వాపోయారు.

‘సీతారామ’ నీరు ఏజెన్సీ ప్రాంతానికి ఇవ్వాలి

పాల్వంచ, అగస్టు 10: సీతారామ ప్రాజెక్టు నీరు ఏజెన్సీ ప్రాంతానికి ఇవ్వాల్సిందేనని, ఏజెన్సీ ప్రాంతాలపై ముగ్గురు మంత్రులు సమాధానం ఇచ్చాకనే ప్రారంభోత్సవం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పాల్వంచ అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు నీరు మొదట భద్రాద్రి జిల్లాకు చెందాలని అన్నారు. ముగ్గురు మంత్రులు నిబంధనలకు విరుద్ధంగా మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరమల్ల మల్లయ్య, శ్రీనివాస్, రాజేష్, నరసింహారావు, వెంకన్న, మల్లేష్, రమేష్, భీమా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధే లక్ష్యం: బీజేపీ

పాల్వంచ టౌన్, ఆగస్టు 10 : తెలంగాణ అభివృద్ధే బీజేపీ లక్ష్యంగా కట్టుబడి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి నుంచి పాండురంగాపురం వరకు రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినందుకు జిల్లా ప్రజలందరి తరఫున ధన్యవాదాలు తెలిపారు. 173.63 కిలోమీటర్ల మేర నూతనంగా రూ. 5000 వేల కోట్ల వ్యయంతో చేపట్టు ఈ రైల్వేలైన్ ప్రాజెక్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఇప్పటికే హైదరాబాద్ నుంచి రాజమండ్రి వరకు వయా ఖమ్మం మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తి కాగా కొత్తగూడెం క్రాస్ రోడ్డు నుంచి ఇల్లెందు మహబూబాద్, తొర్రూరు మీదుగా వలిగొండ, హైదరాబాద్ వరకు నేషనల్ హైవే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, జగదల్‌పూర్ టూ విజయవాడ హైవే పూర్తి అయిందని, భద్రాచలం గోదావరి మీద ఇప్పటికే 2వ బ్రిడ్జి ప్రారంభమైందని తెలిపారు.

పనుల ప్రగతిపై జీఎం సమీక్ష

కొత్తగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో అన్ని ఏరియాల్లో నిర్మాణంలో ఉన్న సివిల్ పనుల ప్రగతిని జీఎం టి. సూర్యనారాయణ అధికారులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సింగరేణి సివిల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ రివ్యూ మీటింగ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి 12 ఏరియాల సివిల్ డిపార్టుమెంట్ అధిపతులు, ఇతర అధికారులు, సిబ్బంది వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అన్ని ఏరియాల సి విల్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే కొత్త ప్రాజెక్టుకు సంబంధించిన పనులపై చర్చించి ఆ నిర్మాణంలోఉన్న పనుల రక్షణతో కూడిన నాణ్యతతో త్వరితగతిన నిర్ణీత కాల పరిమితిలో పూర్తి చేయాలని, రాబోయే కొత్త ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళికలను త్వ రగా సిద్ధం చేసి వాటి యొక్క అమలుకు కృషి చేయాలని ఆదేశిం చారు. ఈ వర్షాకాలంలో వాతావరణ సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, శుభ్రమైన తాగునీటిని సింగరేణి కాలనీ వాసులకు అందచేయాలని సూచించారు.

బీజేపీని బలోపేతం చేయాలి: ధర్మా

దమ్మపేట, ఆగస్టు 10: గ్రామీణ ప్రాంతం నుంచి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మా అన్నారు. దమ్మపేటలో శనివారం సాయంత్రం బీజేపీ మండల సమావేశం అధ్యక్షుడు ప్రశాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మా మాట్లాడుతు కార్యకర్తలు, నాయకులు ఎళ్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యల పట్ల స్థానిక పరిస్థితుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

మీ వైద్య సేవలను గిరిజనులు మరువలేరు

ఆళ్లపల్లి, ఆగస్టు 10: ఉమ్మడి గుండాల మండల నుంచి ఆళ్లపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఏజెన్సీ గ్రామాల్లోని గిరిజనులకు 13 ఏళ్ల పాటు మీరు పీహెచ్‌సీలో చేసిన వైద్యం సేవలను వారు ఎన్నటికి మరువలేరని ఆళ్లపల్లి 108 సిబ్బంది పీహెచ్‌సీ స్టాఫ్‌నర్స్ సమ్మక్కను కొనియాడారు. ఆళ్లపల్లి పీహెచ్‌సీలో స్టాఫ్ నర్స్‌గా 13 ఏళ్ల పనిచేసిన సమ్మక్క పెనగడప పీహెచ్‌సీకి బదిలీ కావడంతో శనివారం ఆమెను ఆళ్లపల్లి ఈఎంటీ భాగ్యమ్మ, ప్రేమలత, పైలెట్ శ్రీహర్ష, సునీల్ ఘనంగా సన్మానించారు. అనంతరం సమ్మక్క 108 సిబ్బందిని సన్మానించారు.